జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో ఆదివారం నిర్వహించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రజా ఆశీర్వాద సభకు భారీగా తరలివచ్చిన ప్రజలు

అలంపూర్ అదుర్స్.. కొల్లాపూర్ జోష్

కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ సభలకు నీరా'జనం'

బీఆర్ఎస్ ప్రచార సభలు గ్రాండ్ సక్సెస్ • ప్రజాశీర్వాద సభలకు వేలాదిగా తరలిన ప్రజలు

మండుటెండలోనూ కదలని జనం • సీఎం కేసీఆర్ స్పీచ్‌కు విశేష స్పందన

బీఆర్ఎస్ అభ్యర్థులకు భారీ మద్దతు • రామక్క పాటతో మరింత ఉత్సాహం

అలంపూర్ సభలో కేసీఆర్ ప్రసంగిస్తుండగా చెయ్యెత్తి మద్దతు తెలుపుతున్న మహిళలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, నవంబర్ 19: బీఆర్ఎస్ ప్రజాఆశీర్వాద సభలు గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. ఆదివారం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు హాజరైన ఉమ్మడి పాలమూరు జిల్లాలోని అలంపూర్, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి నియోజకవర్గాల బీఆర్ఎస్ ప్రచార సభలకు జనం నీరాజనం పట్టారు. వేలాదిగా తరలివచ్చిన ప్రజలు, గులాబీ శ్రేణులతో ప్రజా ఆశీర్వాద సభా ప్రాంగణాలు కిక్కిరిసిపోయియి. గులాబీ దళపతికి ప్రజలు, కార్యకర్తలు, తెలంగాణ అభిమానులు కేరింతలతో ఘన స్వాగతం పలికారు. సీఎం కేసీఆర్ ప్రసంగిస్తున్నప్పుడు జనంలోంచి విశేష స్పందన వచ్చింది. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూనే సీఎం కేసీఆర్ ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తున్న సమయంలో చప్పట్లు, ఈలలతో సభా ప్రాంగణాలు హోరెత్తాయి. మండుటెండను సైతం లెక్క చేయకుండా ముఖ్యమంత్రి రాకకోసం ఎదురుచూసిన ప్రజలు, బీఆర్ఎస్ అభిమానులు.. సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని ఆద్యంతం ఆసక్తిగా విన్నారు. అభివృద్ధి కోసం బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కేసీఆర్ పిలుపునివ్వగా.. జై బీఆర్ఎస్, జై తెలంగాణ అంటూ ముక్తకంఠంతో నినదించారు. సీఎం కేసీఆర్ ప్రసంగిస్తున్న సమయంలో 'జై కేసీఆర్, జై తెలంగాణ' నినాదాలతో సభాప్రాంగణాలు మార్మోగాయి. ధరణి కావాలా? వద్దా? అని ముఖ్యమంత్రి కేసీఆర్ అడగటంతో ప్రజలు పెద్ద ఎత్తున 'కావాలి.. కావాలి' అంటూ నినదించారు. ధరణి కావాలంటే ఎవరికి ఓటు వేయాలని సీఎం అడగ్గా.. 'బీఆర్ఎస్.. బీఆర్ఎస్' అంటూ స్పందించారు. ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ అభ్యర్థులు బీరం హర్షవర్ధన్‌రెడ్డి, మర్రి జనార్దన్‌రెడ్డి, జైపాల్ యాదవ్, విజేయుడును గెలిపించాలని కోరగా, జనం చెయ్యెత్తి జైకొట్టారు. సింగర్స్ మధుప్రియ, ప్రసాద్, మిట్టపల్లి సురేందర్, సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించిన ఆటాపాట కార్యక్రమం ఆకట్టుకున్నది. గులాబీల జెండలే రామక్క.. పాటకు యువతతోపాటు అన్ని వయసుల వారు ఉత్సాహంగా నృత్యాలు చేశారు. కల్వకుర్తిలో సీఎం హెలికాప్టర్ వద్దకు వెళ్తున్న సమయంలో ప్రజలు, అభిమానులు సీఎం కాన్వాయ్ వెంట హెలిపాడ్ దాకా పరుగులు తీశారు.

కొల్లాపూర్ సభా వేదికపై సీఎం కేసీఆర్‌తో ముచ్చటిస్తున్న బీఆర్ఎస్ నేత నాగం

వెలుగుల బీఆరెస్సా? దివాలా కాంగ్రెస్సా?

- కాంగ్రెస్‌కు ఓటేసి కన్నడిగుల అవస్థ
- 3 గంటల కరెంటుతో రైతుకు కష్టం
- 24 గంటల కరెంట్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణే..
- రాష్ట్రంలో గురుకుల విద్య పటిష్టం
- గురుకుల పేరెంట్స్ అసోసియేషన్ ఆత్మీయ సమ్మేళనంలో హరీశ్‌రావు
- 21 అసోసియేషన్లతోపాటు టీఎమ్మార్పీఎస్ మద్దతు
- గులాబీ గూటికి బాబూమోహన్ తనయుడు ఉదయ్

సిద్దిపేటలో ఉదయ్ బాబుమోహన్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో అందోల్ బీఆర్ఎస్ అభ్యర్థి క్రాంతికిరణ్, భిక్షపతి తదితరులు

సిద్దిపేటలో ఆదివారం మంత్రి హరీశ్‌రావును కలిసి బీఆర్ఎస్‌కు మద్దతు ప్రకటిస్తున్న టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ తదితరులు

సిద్దిపేట, నవంబర్ 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి)/అందోల్: దీపావళి వెలుగులు ఇచ్చే బీఆర్ఎస్ కావాలా? కర్ణాటక మాడల్‌లో ఆర్థిక దివాలా కావాలా? అని ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖల మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. కర్ణాటక ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆర్నెళ్లకే ఆ రాష్ట్రాన్ని ఆర్థికంగా దివాళా తీయించిందని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు ఎందుకు ఓటు వేశామా? అని అక్కడి ప్రజలు బాధపడుతున్నారని చెప్పారు. తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల కరెంటు ఇస్తుంటే కర్ణాటకలో 3 గంటలే ఇస్తున్నారని వివరించారు. దీంతో అక్కడి రైతులు అష్టకష్టాలు పడుతున్నారని చెప్పారు. ఆదివారం ఆయన సిద్దిపేటలో తెలంగాణ గురుకుల పేరెంట్స్ అసోయేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిద్దిపేటలోని 21 అసోసియేషన్లు బీఆర్ఎస్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. 'సిద్దిపేట ప్రజల ప్రేమ, అభిమానం నా హృదయంలో పెట్టుకుంటా.. నా చివరి శ్వాస వరకు మీ సేవలో ఉంటాను' అని ఉద్వేగానికి లోనయ్యారు. సీఎం కేసీఆర్ అన్నివర్గాల గురించి ఆలోచించారని, ఆ కోణంలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి చేశారని తెలిపారు. తాగు, సాగునీరు, కరెంటు కష్టాలు తొలగించిన నేత సీఎం కేసీఆర్ అని చెప్పారు. విద్యుత్తు రంగంలో తెలగాణను దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపారన్నారు. సాగునీరు పుష్కలంగా ఉండటంతో రైతులు రెండు పంటలు పండిస్తున్నారని, ధాన్యం ఉత్పత్తిలోనూ రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నదని వివరించారు. అద్భుతమైన మ్యానిఫెస్టోను బీఆర్ఎస్ విడుదల చేసిందని పేర్కొన్నారు. అభివృద్ధి కండ్ల ముందే కనపిస్తున్నదని, మరో సారి బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు.

బట్టెబాజ్ కాంగ్రెస్

ఒకప్పుడు 'నేను రాను బిడ్డో సర్కారు దవాఖానకు' అనేవారని, నేడు 'పోదాం పద బిడ్డ సర్కారు దవాఖానకు' అంటున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. మోకాలుచిప్ప ఆపరేషన్లు ప్రభుత్వ దవాఖానల్లో ఇప్పటికే ప్రారంభించామని, వేల మందికి ఆరోగ్యశ్రీ కింద ఉచిత ఆపరేషన్లు నిర్వహించామని వెల్లడించారు. ఈ మాత్రం తెల్వనోళ్లు కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో రాసుకున్నారని ఎద్దేవాచేశారు. బట్టెబాజ్ కాంగ్రెస్ చేతుల్లో తెలంగాణ ఉండకూడదని హెచ్చరించారు. అప్పుడే పుట్టిన బిడ్డ తల్లి చేతుల్లో ఉంటే ఎంత భద్రంగా ఉంటుందో సాధించుకున్న తెలంగాణ కేసీఆర్ చేతుల్లో ఉంటే అంత భద్రంగా ఉంటుందని చెప్పారు. మొదటి ఐదేండ్ల పాలనలో వ్యవసాయం, కరెంటు, సాగు, తాగునీటి సమస్యలు తీర్చి, రాష్ట్రాన్ని అన్నపూర్ణగా కేసీఆర్ మార్చారని వివరించారు. రెండోసారి విద్య, వైద్యంపై దృష్టి సారించారని పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 290గా ఉన్న గురుకులాల సంఖ్యను 1000కి పెంచారని చెప్పారు. నాడు గురుకులాల్లో లక్షా 90వేల విద్యార్థులుంటే, నేడు 6 లక్షల మంది చదువుకొంటున్నారని తెలిపారు. విద్యపై చేసే ఖర్చును పెట్టుబడి వ్యయంగా భావిస్తున్నామని చెప్పారు. 119 నియోజకవర్గాల్లో అగ్రవర్ణ పేద పిల్లలకు గురుకులాలు ఏర్పాటుచేస్తామన్నారు.

బీఆర్ఎస్‌కు మద్దతు తెలిపిన సంఘాలు

తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ అసోసియేషన్, తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ ఫెడరేషన్, ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్స్ ఫెడరేషన్, సిద్దిపేట జిల్లా అడ్వకేట్ సొసైటీ, తెలంగాణ ప్రైవేట్ ఎలక్ట్రికల్ టెక్నీషియన్ ఫెడరేషన్, గజ్వేల్ ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్, దుబ్బాక మండల ఎలక్ట్రీషియన్ వర్కర్స్ అసోసియేషన్, సిద్దిపేట ప్రైవేట్ ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్, సిద్దిపేట ప్రశాంత్‌నగర్ హౌస్‌వైరింగ్, ఎలక్ట్రీషియన్స్ అసోసియేషన్, న్యూఫ్రెండ్స్ ఆటో మెకానిక్ అసోసియేషన్ సిద్దిపేట, తెలంగాణ మీ-సేవ సిద్దిపేట అసోసియేషన్, తెలంగాణ కాకిపడగల యువజన సంఘం, యాదవ హక్కుల పోరాట సమితి సిద్దిపేట, తెలంగాణ రాష్ట్ర గురుకుల పేరెంట్స్ అసోసియేషన్, ఎన్జీవోస్ కాలనీ సంక్షేమ సంఘం, ప్రశాంత్‌నగర్ సిద్దిపేట, సంతోష్‌నగర్ మెంబర్స్ అసోసియేషన్, ప్రశాంత్‌నగర్ ఆర్యవైశ్య సంఘం, గ్రీన్‌ల్యాండ్ మెంబర్స్ అసోసియేషన్-సిద్దిపేట, పవనసుత యూత్ అసోసియేషన్, ప్రజాసేవ సమితి-సిద్దిపేట, సిద్దిపేట ఓల్డ్ ఐరన్ సెల్లర్స్ అసోసియేషన్, పెయింటింగ్స్ అసోసియేషన్-సిద్దిపేట.

టీఎమ్మార్పీస్ మద్దతు

ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు టీఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్, గుర్రాల శ్రీనివాస్, డప్పు శివ, రాజేందర్, సిద్దిపేట టీఎమ్మార్పీఎస్ కార్యవర్గ సభ్యులు హరీశ్‌రావును కలిసి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు బీఆర్ఎస్ కట్టుబడి ఉన్నదని చెప్పారు. రాష్ట్రం ఏర్పడ్డ మొదట్లోనే అసెంబ్లీలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపామని గుర్తుచేశారు. తొమ్మిదేండ్లు నానబెట్టి ఎన్నికల వేళ కేంద్రం కొత్త కమిటీ అని చెప్పున్నదని విమర్శించారు. కమిటీ కాదు బిల్లు పెట్టాలని డిమాండ్ చేశారు. జాతీయ రాజకీయాల్లో బీఆర్ఎస్ కీల కపాత్ర పోషిస్తుందని, వర్గీకరణ చేసి తీరుతామని చెప్పారు.

బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు

సిద్దిపేట నియోజకవర్గానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీజేపీ నేతలు మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. బీజేపీ సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, రాష్ట్ర ఓబీసీ జనరల్ సెక్రటరీ ఉడుత మల్లేశం, భజరంగదళ్ జిల్లా అధ్యక్షుడు బయ్యారం కమలాకర్‌రెడ్డి, సిద్దిపేట మండల బీజేపీ కార్యదర్శి విజయ్, తీన్మార్ మల్లన్న టీమ్ జిల్లా కన్వీనర్ మోత్కు సాయికుమార్, పట్టణ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు స్వప్న, పురుమాండ్ల వెంకట్‌రెడ్డి, అవినాశ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సామల్ల నరేందర్‌రెడ్డి తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ మంత్రి హరీశ్‌రావు గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి స్వాగతించారు.

బీఆర్ఎస్‌లోకి బాబూమోహన్ కుమారుడు

సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బాబూమోహన్ కుమారుడు ఉదయ్ బాబూమోహన్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే క్రాంతికిరణ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆయనతోపాటు పలువురు నేతలకు మంత్రి హరీశ్‌రావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఉదయ్‌కు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కాంగ్రెస్, బీజేపీపై ప్రజలకే కాదు ఆయా పార్టీ నేతల కుటుంబసభ్యులకు కూడా నమ్మకం పోయిందని చెప్పారు. బీఆర్ఎస్ విజయానికి కృషి చేస్తానని ఉదయ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో స్టేట్ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ మఠం భిక్షపతి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు జైపాల్ రెడ్డి, కాశీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

జీడీపీలో దేశంలోనే తెలంగాణ టాప్

మొదటిపేజీ తరువాయి...

తెలంగాణ టాప్‌లో నిలిచింది. ఒక ప్రాంతంలో ఒక ఆర్థిక సంవత్సరంలో ఉత్పత్తి అయిన మొత్తం వస్తు, సేవలను ఆ ప్రాంత జనాభాతో భాగిస్తే వచ్చేదే తలసరి జీడీపీ. 2011 జనాభా లెక్కల ఆధారంగా ఫోర్బ్స్ ఈ జాబితాను విడుదల చేసింది.

రాష్ట్రం	తలసరి ఎన్ఎస్డీపీ (రూ.లక్షల్లో)
తెలంగాణ	3.08
సిక్కిం	5.19
గోవా	4.72
కర్ణాటక	3.01
హర్యానా	2.96
తమిళనాడు	2.73
గుజరాత్	2.41
ఉత్తరాఖండ్	2.33
కేరళ	2.33
మహారాష్ట్ర	2.24
హిమాచల్ ప్రదేశ్	2.22
ఆంధ్రప్రదేశ్	2.19
అరుణాచల్‌ప్రదేశ్	2.05
రాజస్థాన్	1.56
ఒడిశా	1.5
బెంగాల్	1.41
మధ్యప్రదేశ్	1.4
ఛత్తీస్‌గఢ్	1.33
ఉత్తరప్రదేశ్	0.88
బిహార్	0.55

4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా భారత్?

ఏది నిజం? ఏదీ నిజం

ప్రచారం: దేశ ఆర్థిక వ్యవస్థ తొలిసారి 4 ట్రిలియన్ డాలర్ల మైలురాయిని దాటిందని సోషల్ మీడియాలో విస్తృతంగా ప్రచారం జరుగుతున్నది. ఐఎంఎఫ్ డాటా ఆధారంగా అన్ని దేశాలకు సంబంధించిన జీడీపీ లైవ్ ట్రాకింగ్ డాటా అంటూ ఓ స్క్రీన్ గ్రాబ్‌ను షేర్ చేస్తున్నారు. మోదీ నాయకత్వంలో దేశం ఈ మైలురాయిని అధిగమించిందంటూ కేంద్ర మంత్రులు గజేంద్రసింగ్ షెఖావత్, కిషన్‌రెడ్డి, మహారాష్ట్ర డిప్యూటీ సీఎం దేవేంద్ర ఫడ్నవీస్, బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురంధేశ్వరి తదితరులు ఎక్స్‌లో హర్షం వ్యక్తం చేశారు.

వాస్తవం: భారత్ 4 ట్రిలియన్ డాలర్ల మైలురాయిని దాటిందంటూ ప్రచురితమవుతున్న కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఇలా అన్ని దేశాల జీడీపీ గణాంకాలను లైవ్‌గా ట్రాక్ చేయడం చాలా కష్టం అని తెలిపాయి. మరోవైపు జీడీపీ 4 ట్రిలియన్లు దాటడంపై కేంద్ర ప్రభుత్వం కూడా అధికారికంగా వెల్లడించలేదు.

మోసం గ్యారెంటీ.. క్యూఆర్ క్యాంపెయిన్

- కాంగ్రెస్ బూటకపు కార్డులు ఆన్‌లైన్‌లో కేటాయింపు
- నియోజకవర్గాలవారీగా ఫోన్ నంబర్లు, వివరాల సేకరణ

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): బూటకపు హామీలతో ప్రజలను మభ్యపెడుతున్న కాంగ్రెస్ పార్టీ మరో కొత్త మోసానికి తెరలేపింది. 'క్యూఆర్ క్యాంపెయిన్' పేరుతో ఆన్‌లైన్‌లో ప్రజల వివరాలను సేకరిస్తున్నది. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల కార్డులను అందిస్తామంటూ ఓ లింక్‌ను అందరికీ పంపుతున్నది. ఇందులో వ్యక్తి పేరు, ఫోన్ నంబర్ వివరాలు ఇచ్చి, నియోజకవర్గాన్ని ఎంచుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఏది కావాలో ఎంచుకొని క్లిక్ చేస్తే పేరు, ఫోన్ నంబర్‌తో గ్యారెంటీ కార్డులు తయారవుతున్నాయి. ఇది పెద్ద మోసమని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. నిజంగా అర్హత ఉన్నదా? లేదా అని కనీసం చెక్ చేయకుండా ఆటోమెటిక్‌గా కార్డులు తయారవుతున్నాయని తెలిపారు. ఉదాహరణకు పురుషులకు కూడా 'మహాలక్ష్మి పథకం' కింద ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని హామీ కార్డు ఇస్తున్నారు. పైగా ఈ గ్యారెంటీ కార్డులకు ఎలాంటి విలువ లేదని స్పష్టం చేస్తున్నారు. అయినా ఓటర్లకు ఆశ చూపడం, మైండ్ గేమ్ ఆడటమే కాంగ్రెస్ లక్ష్యమని చెప్తున్నారు. క్యూఆర్ క్యాంపెయిన్ పేరుతో నియోజకవర్గాలవారీగా ఓటర్ల ఫోన్ నంబర్లు సేకరిస్తున్నదని పేర్కొంటున్నారు. ఆయా నంబర్లకు తమ కాల్ సెంటర్ల ద్వారా ఫోన్లు చేయించి, మెసేజ్‌లు పంపుతారని, నేతలు ప్రలోభ పెట్టేందుకు అవకాశాలు కూడా ఉన్నాయని విశ్లేషకులు చెప్తున్నారు.

బీజేపీది ప్రజలను చీల్చే మ్యానిఫెస్టో

- అది రాష్ట్రాభివృద్ధికి ఉపయోగపడదు: తమ్మినేని

హైదరాబాద్, నవంబర్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో బీజేపీ ప్రకటించిన మ్యానిఫెస్టో ప్రజల మధ్య చీలిక తెచ్చేలా, అభివృద్ధి నిరోధకంగా ఉన్నదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం విమర్శించారు. సంక్షేమ పథకాలకు కోతకోసే మ్యానిఫెస్టోను బీజేపీ ప్రకటించిందని, అది రాష్ట్రాభివృద్ధికి ఉపయోగపడేది కాదని దుయ్యబట్టారు. తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అమలుచేయని వాటిని తెలంగాణలో అమలు చేస్తామనడం ప్రజలను మోసగించడమేనని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న లక్షలాది ఖాళీలు నింపకుండా, ఇక్కడ ఉద్యోగాల భర్తీ చేస్తామంటే నమ్మాలా? అని ప్రశ్నించారు. కేంద్రంలో అధికారంలో ఉండీ ద్రవ్యోల్బణాన్ని అరికట్టలేని బీజేపీ.. తెలంగాణలో ఎట్లా అరికడుతుందని నిలదీశారు. కేంద్రంలో పదేండ్ల నుంచి అధికారంలో ఉన్న బీజేపీ ధాన్యానికి రూ.3100 మద్దతు ధరను ఎందుకు నిర్ణయించలేదని ప్రశ్నించారు. పార్లమెంటులో చిన్న సవరణ చేస్తే ఎప్పుడో అమల్లోకి వచ్చే ఎస్సీ వర్గీకరణకు ఇప్పుడు మళ్లీ కమిటీ వేస్తామనడం ఎన్నికల జిమ్మిక్కే అని పేర్కొన్నారు. మైనారిటీలకు అమలవుతున్న రిజర్వేషన్లు ఎత్తివేస్తామంటే ఇది ప్రజల్లో చీలికకు ఉపయోగపడేదే తప్ప మరొకటి కాదని విమర్శించారు.

సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో మాట్లాడుతున్న బోయినపల్లి వినోద్‌కుమార్

బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటే

- బీఆర్ఎస్‌కు ఏ పార్టీతో పొత్తు లేదు
- మైనార్టీల సంక్షేమానికి కేసీఆర్ కృషి
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్

సిరిసిల్ల టౌన్, నవంబర్ 19: బీజేపీ, కాంగ్రెస్ ఒక్కటేనని.. బీఆర్ఎస్‌కు ఏ పార్టీతోనూ పొత్తు లేదని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చీటి నర్సింగరావు సమక్షంలో కాంగ్రెస్ జిల్లా మైనార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఫయాజ్, కాంగ్రెస్ పట్టణ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పర్వేజ్, కాంగ్రెస్ మైనార్టీ నేత యూనస్ ఆధ్వర్యంలో 410 మందితోపాటు టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు సలీం తదితరులు ఆదివారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి వినోద్‌కుమార్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ బీజేపీలో కలుస్తుందని కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. గత ఎంపీ ఎన్నికల్లో బీజేపీకి కాంగ్రెస్ మద్దతునిచ్చిందని ఆరోపించారు. లేకుంటే ఆదిలాబాద్, నిజామాబాద్, సికింద్రాబాద్, కరీంనగర్ ఎంపీ స్థానాల్లో బీఆర్ఎస్ గెలిచేదని ఆయన పేర్కొన్నారు. పొన్నం ప్రభాకర్, మధుయాష్కీకి డిపాజిట్ రాలేదంటే.. దాని అంతరార్థం కాంగ్రెస్, బీజేపీకి మద్దతు ఇచ్చినట్టేనని ఆయన స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆర్ఎస్‌యూ నుంచి ఆర్ఎస్ఎస్, కమ్యూనిస్టులు, బీజేపీ, కాంగ్రెస్ అన్ని పార్టీల వద్దకు వెళ్లి రాష్ట్రాన్ని సాధించుకున్నామని అన్నారు. సిరిసిల్లలో ముస్లింలంతా బీఆర్ఎస్‌కు ఇచ్చిన సంపూర్ణ మద్దతు దేశమంతా తెలియాల్సిన అవసరం ఉన్నదని సూచించారు. స్వరాష్ట్రంలో ముస్లింల సంక్షేమానికి విశేష కృషి చేసినట్టు చెప్పారు. సిరిసిల్లలో ఇంటర్నేషనల్ డ్రైవింగ్ స్కూల్ ఏర్పాటు ద్వారా ఉపాధి అవకాశాలకు బాటలు వేస్తున్నారన్నారు.